# రైతు సమస్యలపై అసెంబ్లీ ముట్టడి

- బడ్జెట్‌లోగా హామీలు అమలు చేయాలి
- ఆరు నెలల్లోనే మంత్రులకు అహంకారం
- సన్నాలకే బోనస్ ఇస్తామనడం మోసమే
- జూన్‌లోనే రైతుభరోసా ఇవ్వాలి
- హైదరాబాద్‌పై బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు
- ఖమ్మం పర్యటనలో హరీశ్‌రావు
- పట్టభద్రుల బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి




ఖమ్మం రూరల్ మండలంలోని బారుగూడెంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, ఎంపీ నామా

ఖమ్మం, మే 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జూలైలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రైతులతో చలో అసెంబ్లీకి పిలుపునిచ్చి ముట్టడిస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు. ఆరు నెలల్లోనే మంత్రులకు అహంకారం పెరిగిపోయిందని, రైతులను అవహేళన చేసేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వానకాలం పంటకైనా సీజన్‌కు ముందుగానే జూన్‌లోనే రైతుభరోసా అందించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం-నల్లగొండ-వరంగల్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం ఆయన ఖమ్మం జిల్లాలో పర్యటించారు. సత్తుపల్లి, బోనకల్లు, ఖమ్మంరూరల్ మండలం బారుగూడెంలో జరిగిన జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలో మీడియాతో మాట్లాడారు. ఆయా సమావేశాల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రైతుల కాళ్లు మొక్కి వంద రోజుల్లో రుణమాఫీ, రైతుభరోసా రూ.7,500, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని నమ్మించి మోసగించిందని మండిపడ్డారు. వడ్లకు రూ.500 బోనస్ అడిగిన పాపానికి అవగాహనలేక మాట్లాడుతున్నారని వ్యవసాయశాఖ మంత్రి అనడం రైతులను అవమానపరచడమేనని పేర్కొన్నారు. సన్నాలను పండిస్తే పంటకు తెగులెక్కువ, దిగుబడి తక్కువగా వస్తుందని చెప్పారు. దొడ్డు వడ్లు 120 రోజుల్లో దిగుబడి వస్తే, సన్న వడ్లు 150 రోజుల్లో వస్తాయని తెలిపారు. రాష్ట్రంలోని 99% మంది రైతులు దొడ్డు వడ్లను పండిస్తారని కేవలం ఒక్కశాతమే సన్నవడ్లను పండిస్తారని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లు అయినా పాలనపై పట్టు సాధించలేక ఏ ఒక్క హామీని నెరవేర్చలేకపోయిందని విమర్శించారు.సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గతంలో సీఎం కేసీఆర్‌తో మాట్లాడి గోదావరి జలాలను తెచ్చారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇయ్యలేక పంటలను ఎండబెట్టిందని మండిపడ్డారు. వర్షాలు పడుతున్నాయి మహాప్రభో.. జీలుగు, జను ము విత్తనాలు అందించాలని అధికారులకు రైతులు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. విత్తనాల పంపిణీ కి అనుమతిలేదని తల్లాడలో అధికారి చెప్పడంపై ధ్వజమెత్తారు.

### హైదరాబాద్‌పై కుట్రలు

హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసేందుకు బీజేపీ, ఉమ్మడి రాజధానిగా చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్ర పన్నుతున్నాయని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రశ్నించేతత్వం ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, నామా, నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, ఉపేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, కొండబాల కోటేశ్వరరావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



కమలాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ నేతలతో కలిసి సందర్శిస్తున్న హరీశ్‌రావు (ఫైల్)



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌లో లారీలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న దృశ్యం

## హరీశ్‌రావు రాకతో కదిలిన ధాన్యం

- కమలాపూర్ కేంద్రం నుంచి లారీల్లో వడ్ల బస్తాల తరలింపు

*జయశంకర్ భూపాలపల్లి. మే 24 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి మండలం కమలాపూర్ కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభమైంది. శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కమలాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ వర్షానికి తడిసి ఉన్న ధాన్యాన్ని, రైతుల బాధలు చూసి చలించిపోయారు. హరీశ్‌రావు ముందు రైతులు తమ బాధలు ఏకరువు పెట్టుకొన్నారు. 20 రోజులుగా కేంద్రంలోనే ధాన్యం ఉంటుందని, వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ మొలకలు వస్తున్నాయని, బోనస్ మాట దేవుడెరుగు ముందు మా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వాపోయారు. మల్లికాంబ అనే మహిళా రైతు హరీశ్‌రావు ముందు తన కష్టాలు చెబుతూ కన్నీరుమున్నీరైంది. వెంటనే అప్పుడే జాయింట్ కలెక్టర్‌తో హరీశ్‌రావు మాట్లాడారు. నిర్వాహకులు ధాన్యాన్ని కొనుగోలు ప్రారంభించారు. మూడు లారీల్లో ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.*

## కాంగ్రెస్ వచ్చింది.. కష్టాలు తెచ్చింది..!

**హరీశ్‌రావు వద్ద గోడు వెళ్లబోసుకున్న రైతులు**

'మాయదారి కాంగ్రెస్ వచ్చి మా అందరికీ కష్టాలు తెచ్చిపెట్టింది' అంటూ రైతులు హరీశ్‌రావు ఎదుట తమ ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ తమను కంటికిరెప్పలా కాపాడుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారని వాపోయారు. సత్తుపల్లిలో పట్టభద్రుల సమావేశానికి హాజరై తిరిగి ఖమ్మం వస్తున్న క్రమంలో తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామ శివారున ఆ గ్రామానికి చెందిన రైతులు కల్యాణపు చిన్నసత్యం, కల్యాణపు కృష్ణయ్య, రామిశెట్టిపల్లి లక్ష్మణరావు మరికొంతమంది రైతులతో కలిసి హరీశ్‌రావు వాహనాన్ని ఆపారు. వారిని గమనించి వాహనం దిగిన హరీశ్‌రావు.. 'ఏం పెద్దాయానా.. బాగున్నారా? వ్యవసాయం ఎలా ఉన్నది? ఇప్పుడు పరిస్థితి ఎట్లా ఉన్నది?' అంటూ పలుకరిస్తూ వారితో కలిసి పొలాల్లోకి వెళ్లారు. 'ఏం చెప్పమంటారూ సారు.. మా బాధలు వర్ణనాతీతతం' అంటూ రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం వారు తమ బాధలన్నింటినీ హరీశ్‌రావు ఎదుట వెళ్లబోసుకున్నారు. 'సారూ.. రైతుల పక్షాన అసెంబ్లీలో పోరాడండి. మేమంతా కదిలివచ్చి అసెంబ్లీని ముట్టడిస్తాం. అందరం కలిసి ప్రభుత్వాన్ని నిలదీద్దాం' అని రైతులు ముక్తకంఠంతో చెప్పారు. 'అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సన్నవడ్లకే బోనస్ ఇస్తానంటున్నది. దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వనంటున్నది. పంటలకు సాగునీళ్లు ఇవ్వలేదు. మోటరు వేసుకునేందుకు కరెంటూ ఇవ్వలేదు. ఆఖరికి పంటల పెట్టుబడికి రైతుభరోసా కూడా ఇవ్వలేదు' అంటూ తమ గోడు వెళ్లబోసుకున్నారు.



ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామశివారులో రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

## అవగాహన లేకే టిమ్స్‌పై చౌకబారు వ్యాఖ్యలు

- మంత్రి కోమటిరెడ్డిపై ఎక్స్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టిమ్స్ నిర్మాణాలపై ఆర్అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విషం చిమ్మడం బాధాకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన టిమ్స్‌పై అవగాహన లేక చవకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. జనాభా అవసరాలకు అనుగుణంగా, అత్యాధునిక, నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో హైదరాబాద్ నలువైపులా టిమ్స్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేసిందని శుక్రవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఐదు నెలలుగా ఆ నిర్మాణాలను, పనుల పర్యవేక్షణను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. లేని పోని ఆరోపణలు చేస్తున్నదని విమర్శించారు. టిమ్స్ పట్ల కనీస అవగాహన లేకుండా కోమటిరెడ్డి మాట్లాడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. టిమ్స్ ఎల్బీనగర్ దవాఖాన నిర్మాణం జీ+14 అంతస్థులు అయితే 27 అంతస్తులు అని మాట్లాడడం కోమటిరెడ్డి అవగాహన రాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఎక్కువ అంతస్థులు ఉంటే పేషెంట్లు ఇబ్బంది పడతారని మొసలి కన్నీరు కార్చుతున్న మంత్రి, రాజస్థాన్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ తలపెట్టిన 24 అంతస్థుల దవాఖాన, ఇండియా కూటమిలో భాగస్వామి సీఎం కేజ్రీవాల్ ఢిల్లీలో నిర్మిస్తున్న 22 అంతస్థుల హాస్పిటల్ కనిపించడం లేదా? అని నిలదీశారు.

## 2న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ!

- రాష్ట్ర అధికారిక గీతంగా 'జయ జయహే తెలంగాణ'
- ఆవిర్భా వ వేడుకలకు సోనియాగాంధీ రాక
- వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా జూన్ 2న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రభుత్వం అధికారికంగా ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ప్రస్తుతం ఉన్న రూపానికి మార్పులు, చేర్పులు చేసి కొత్త విగ్రహాన్ని తయారు చేయించింది. దీంతోపాటు మార్పులు చేసిన అధికారిక చిహ్నాన్ని, రాష్ట్ర అధికారిక గీతంగా 'జయ జయహే తెలంగాణ' పాటను విడుదల చేయనున్నట్టు సమాచారం. వేడుకలకు కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని ముఖ్యఅతిథిగా ఆహ్వానించనున్నారు. ఆమె చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీంతోపాటు సీఎం రేవంత్ రెడ్డి కొన్ని కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉన్నదని, పలువురు ఉద్యమకారులను సన్మానించేందుకు జాబితాను సైతం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదే వేదిక మీదుగా అమరవీరుల కుటుంబాలకు స్థలం, పెన్షన్ ఇచ్చే పథకాన్ని ప్రకటించే అవకాశం ఉన్నదని చెప్తున్నారు.

### వేడుకలకు పటిష్ట భద్రత

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారి ఉన్నతాధికారులను ఆదేశించారు. శుక్రవారం వివిధ శాఖలతో ఆమె సమీక్ష నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో వేడుకల నిర్వహణకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా గన్‌పార్క్‌ను సందర్శించి, అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాల్లో తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాలను కేటాయించేటప్పుడు రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, రోడ్డుకు ఇరువైపులా జెండాలతో అలంకరించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆ శాఖను ఆదేశించారు. కార్యక్రమంలో డీజీపీ రవిగుప్తా, ఎస్‌సీఎస్ అధర్ సిన్హా, ముఖ్య కార్యదర్శులు బి వెంకటేశం, జితేందర్, కార్యదర్శులు క్రిస్టినా జోంగ్తు తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సోనియాకు ఏ హోదాలో ఆహ్వానం?

- రాష్ట్ర అవతరణ వేడుకలకు ఎలా పిలుస్తరు?
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ఢిల్లీ నుంచి పాలన
- సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్



బొడ్రాయిబజార్, మే 24 : జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు సోనియాగాంధీని ఎలా పిలుస్తారని, ఆమె ఏ హోదాలో తెలంగాణాకు వస్తారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం మళ్లీ పరాయి పాలనలోకి వెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సగంకాలం పాలన ఢిల్లీ నుంచి చేయాల్సి వచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ పని చేయాలన్నా ఢిల్లీలో అనుమతి తీసుకుని చేయాలని, రాష్ట్ర హక్కులు, నదీ జలాలను హరిస్తున్నారని మండిపడ్డారు. గోదావరిని కావేరికి తరలించడంపై మరో ఉద్యమం తప్పేట్టు లేదని హెచ్చరించారు. కేసీఆర్ తొమ్మిదేండ్లుగా అద్భుతంగా విద్యుత్తును అందించారని, దాన్ని కొనసాగించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. సెల్‌ఫోన్ వెలుగుల్లో దవాఖానల్లో ఆపరేషన్లు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, కేసులతో ప్రభుత్వాన్ని నడుపుకొందామని కాంగ్రెస్ చూస్తున్నదని దుయ్యబట్టారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కేసీఆర్ కోసమే ప్రజలు ఎదురు చూస్తుంటారని తెలిపారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లోనే చీలికలొస్తాయని జోస్యం చెప్పారు. ఆయన వెంట మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ ఉన్నారు.

## అమ్మకానికి భూములు!

మొదటిపేజీ తరువాయి...

కాబట్టి ధర కూడా బాగా పలుకుతుందని, తద్వారా సులభంగా, వేగంగా, అనుకున్న స్థాయిలో నిధుల సమీకరణ సాధ్యమవుతుందని అంచనా వేస్తున్నారు. ఇతర చోట్ల అయితే భూముల సేకరణ, వాటిని అభివృద్ధి చేయడం ఆ తర్వాత వేలం వేయడానికి చాలా సమయం పడుతుంది. ఈ క్రమంలో మొదట బుద్వేల్‌లోని దాదాపు 75 ఎకరాలను విక్రయించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీచేసినట్టు తెలిసింది. అక్కడ ఎకరానికి సుమారు రూ.50-55 కోట్ల మేర ధర పలుకుతున్నది. వీటి అమ్మకం ద్వారా రూ.4వేల కోట్ల వరకు నిధుల సమీకరణ చేయవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. అక్కడ వచ్చే స్పందనను బట్టి హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఇతర భూములను విక్రయించడంపై దృష్టిపెట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా భూముల అమ్మకంపై నానా యాగీ చేసిన సంగతిని ఈ సందర్భంగా పలువురు గుర్తుచేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భూములను అమ్మినప్పుడల్లా తీవ్ర విమర్శలు చేసి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలా అమ్ముతారని ప్రశ్నిస్తున్నారు.

### ఫార్మాసిటీ భూములను ఏం చేస్తారు?

ముచ్చర్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటు కోసం సుమారు 10వేల ఎకరాలను సేకరించిన సంగతి తెలిసిందే. ఈ భూములను అభివృద్ధి చేసి, పారిశ్రామికవేత్తలకు కేటాయించేందుకు సిద్ధం చేసింది. పనులు చివరి దశలో ఉండగా ప్రభుత్వం మారింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేయడంతో దాదాపు 10వేల ఎకరాలు ప్రభుత్వానికి అందుబాటులోకి రానున్నాయి. వీటిని ఏం చేస్తారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

## ప్రణవ్ తీరుపై కాంగ్రెస్ నాయకుల కస్సుబుస్సు

- ఆయన బెదిరింపులకు భయపడేది లేదు
- సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్తాం
- మీడియాతో కాంగ్రెస్ నాయకుల వెల్లడి

జమ్మికుంట, మే 24 : హుజూరాబాద్‌లో ప్రణవ్ బాబు కాంగ్రెస్‌కు ఇన్‌చార్జిగా కాకుండా ఒక గడీకి నాయకుడిగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్మూరి వెంకట్ నియమించిన కమిటీలను ఎలా రద్దు చేస్తారని, అసలు ప్రణవ్‌కు సభ్యత్వం ఉన్నదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు వైఖరిని నిరసిస్తూ శుక్రవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో ఆ పార్టీ నాయకులు మీడియాతో మాట్లాడారు. ప్రణవ్ పార్టీ కోవర్టుగా పనిచేస్తున్నారని, ఆయన బెదిరింపులకు భయపడేది లేదన్నారు. ప్రణవ్‌పై సీఎం రేవంత్‌రెడ్డికి, మం త్రులు పొన్నం, శ్రీధర్‌బాబుకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు సమ్మిరెడ్డి, వెంకటేశ్వర్లు, సలీం, రామస్వామి తదితరులు ఉన్నారు.

## రేవంత్‌పై ఆరోపణలు చేస్తే బీజేపీ ఆఫీస్ ముట్టడి

- పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి హెచ్చరిక
- ఆ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం : జగ్గారెడ్డి

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిపై మరోసారి ఆరోపణలు చేస్తే బీజేపీ ఆఫీసు ముట్టిడిస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తల్లి సోనియా గాంధీని సన్మానిస్తామని, అమె రాకను అడ్డుకొంటే ప్రజలు తిరుగబడుతారు తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. గాంధీభవన్‌లో శుక్రవారం మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 15 లోపు 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్టు పేర్కొన్నారు.

# క్యాబినెట్ బెర్త్.. పైరవీలు

మొదటిపేజీ తరువాయి...

కనిపిస్తున్నది. ఇప్పటికే మంత్రివర్గంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జూపల్లి కృష్ణారావుకు ప్రాతినిధ్యం ఉంది. సీఎం రేవంత్ కూడా ఇదే జిల్లాకు చెందినవారు. అయినప్పటికీ మరొకరికి ఈ జిల్లా నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించనున్నట్టు సీఎం స్వయంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో క్యాబినెట్ బెర్త్ కోసం పైరవీలు ఊపందుకున్నట్టు తెలిసింది.

### పార్లమెంట్ ఫలితాలతో ముడిపడి

ఏదైనా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థికి ప్రత్యర్థితో సరిసమానంగా ఓట్లు వచ్చి, ఒక్క అసెంబ్లీ సెగ్మెంట్‌లో భారీ మెజార్టీ సాధించడం వల్ల పార్టీ విజయానికి కారణం అయితే అలాంటి చోట సదరు ఎమ్మెల్యే కృషికి ప్రతిఫలంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్నది అధిష్ఠానం ఆలోచనగా ఉన్నట్టు తెలిసింది. పార్లమెంట్ ఫలితం ఆధారంగా ఎమ్మెల్యేలకు ప్రభుత్వంలో అవకాశాలు ఉంటాయని కేసీ వేణుగోపాల్ ఇప్పటికే స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని జిల్లాలకే అవకాశం ఉంటుందని చెప్పలేమని విశ్లేషిస్తున్నారు.

### ప్రాతినిధ్యం లేని జిల్లాలు

ఎమ్మెల్యేల సంఖ్య ఆధారంగా మంత్రి పదవుల సంఖ్య ఖరారు అవుతుంది. ఈ లెక్కన తెలంగాణలో సీఎంతో కలుపుకొని మంత్రివర్గంలో 18 మందికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం సీఎంతో కలిపి 12 మందికి అవకాశం లభించింది. మరో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభించని ఉమ్మడి జిల్లాల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉన్నాయి. ఇందులో హైదరాబాద్ నుంచి కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. ఈ జిల్లాను మినహాయిస్తే మిగిలేది ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలు మాత్రమే. ఆదిలాబాద్ నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మంత్రి పదవి ఆశిస్తుండగా, నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కూడా మంత్రి పదవిపై కన్నేశారు. ఈసారి మంత్రివర్గ విస్తరణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీల్లో నలుగురికి మాత్రమే అవకాశం ఉంటుందని సీం పేర్కొన్న నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం కోటాలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పీ సుదర్శన్‌రెడ్డికి మంత్రిపదవి ఖాయమని బలంగా వినిపిస్తోంది. ఓసీ కోటాలో మరొకరికి అవకాశం లేకపోవచ్చని అంచనా వేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి గెలుపొందిన ఏకైక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా మంత్రిపదవి ఆశిస్తున్నారు. ఓసీ కోటాలో నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డికి అవకాశం కల్పించే పక్షంలో మల్‌రెడ్డికి మంత్రిపదవి దక్కే అవకాశం దాదాపు లేనట్టేనని చెప్తున్నారు. ఇప్పటికే రెడ్డి సామాజిక వర్గం నుంచి సీఎంతో కలుపుకొని నలుగురికి అవకాశం లభించింది. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముగ్గురు మంత్రులుగా ఉన్నారు. మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్‌రెడ్డికి అవకాశం కల్పిస్తే, ఒకే సామాజిక వర్గం నుంచి ఐదుగురికి అవకాశం కల్పించినట్టు అవుతుంది.


### హైదరాబాద్ నుంచి ఎవరికి?

గ్రేటర్ హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం లేకపోవడంతో ఇక్కడి నుంచి మంత్రి అయ్యే అవకాశం ఎవరికీ లేకుండా పోయింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి గెలిస్తే మంత్రి పదవి ఖాయమని చెప్తున్నారు. బీసీ కోటాలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ఒక్కరికే మంత్రి పదవి లభించే అవకాశం ఉందని అంచనా. ఎస్టీ కోటాలో మంత్రివర్గంలో ఇప్పటికే సీతక్క కొనసాగుతుండడంతో లంబాడ సామాజిక వర్గానికి చెందిన దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్‌కు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఇప్పటికే భట్టి విక్రమార్క, దామోదర రాజనరసింహ మంత్రివర్గంలో ఉండటం, ప్రసాద్‌రావు స్పీకర్‌గా ఉన్నప్పటికీ రాష్ట్రంలో వీరి జనాభా ప్రాతిపదికన మరొకరికి మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పిస్తారని సమాచారం. పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికలో మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందన్న విమర్శల నేపథ్యంలో ఈ సామాజిక వర్గానికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉన్నప్పటికీ అది ఎవరన్న దానిపై పార్టీలో ఇంకా క్లారిటీ లేదు.

### మైనార్టీకి అవకాశం లేనట్టే?

కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలలో మైనార్టీల (ముస్లిం) నుంచి ఎవరూ విజయం సాధించకపోవడంతో మంత్రివర్గంలో చోటు లేకుండా పోయింది. మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఓటమి పాలుకావడంతో ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి మంత్రివర్గంలోకి తీసుకుంటారని భావించారు. ఆయన్ను ప్రభుత్వ సలహాదారుగా నియమించడంతో మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం లేదని తేలిపోయింది. నాంపల్లి నుంచి ఓటమిపాలైన ఫిరోజ్‌ఖాన్ హైదరాబాద్ నగరం కోటాలో తనకు మంత్రి పదవి గ్యారెంటీ అని ఆశలు పెట్టుకున్నారు.

## లోకం పోకడ




వన్ బై టూ సర్దుకొమ్మన్నారు

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 43.5°c | 32.6°c |
| ఆదిలాబాద్ | 43.3°c | 27.3°c |
| మహబూబ్‌నగర్ | 42.2°c | 30.5°c |
| ఖమ్మం | 42.0°c | 30.0°c |
| మెదక్ | 41.9°c | 25.1°c |
| రంగారెడ్డి | 41.3°c | 24.1°c |
| కరీంనగర్ | 41.0°c | 30.0°c |
| వరంగల్ | 40.0°c | 28.0°c |
| హైదరాబాద్ | 39.7°c | 26.9°c |
| నిజామాబాద్ | 39.6°c | 24.3°c |

## దవాఖానల్లో మందుల కొరత లేదు

- సరఫరాదారులకు రూ. 124 కోట్లు చెల్లించాం
- 'నమస్తే' కథనంపై వైద్యారోగ్యశాఖ వివరణ

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ దవాఖానల్లో ఎక్కడా మందుల కొరత లేదని వైద్యారోగ్య శాఖ స్పష్టం చేసింది. నమస్తే తెలంగాణలో శుక్రవారం ప్రచురితమైన 'మందుల్లేవు - నిధుల కోత, ఔషధాల కొరత' వార్తపై స్పందించింది. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు సరఫరాదారులకు రూ.124 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించామని, మరో రూ.316 కోట్ల మేర చెల్లింపుల కోసం ఆర్థిక శాఖకు చెక్కులు పంపించామని వెల్లడించింది. రాష్ట్రంలోని అన్ని దవాఖానలు, సీఎంఎస్ స్టోర్లలో సరిపడా మందుల నిల్వలు ఉన్నాయని, దవాఖానల నుంచి విజ్ఞప్తి రాగానే సీఎంఎస్ స్టోర్ల నుంచి మందులు సరఫరా చేస్తున్నట్టు పేర్కొన్నది. 'ట్విన్ సిటీస్ హాస్పిటల్ సప్లయర్స్ అసోసియేషన్' నుంచి టీఎస్ఎంఎస్ఐడీసీ ఎలాంటి ఔషధాలు కొనుగోలు చేయడం లేదని తెలిపింది. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం వల్ల మందుల సరఫరా నిలిచిపోవడమనేది అసత్యమని వివరించింది. హీమోఫీలియా ఫ్యాక్టర్ 7, 8, 9 ను ప్రముఖ కంపెనీల నుంచి కొనుగోలు చేస్తామని, ప్రస్తుతం దవాఖానల్లో ఎలాంటి కొరత లేదని స్పష్టం చేసింది.

## నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్లు


హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో అనర్హులకు రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలను డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ జీ రామ్‌దాన్ శుక్రవారం ఖండించారు. డీ ఫార్మసీలో మూడు సబ్జెక్టులు బ్యాక్‌లాగ్ ఉన్నవారికి కూడా రిజిస్ట్రేషన్ చేసేందుకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఈ మేరకు 2009 నుంచి 2017 మధ్య ఫార్మసీ డిప్లొమా చేసి బ్యాక్‌లాగ్ ఉన్నవారికి కూడా రిజిస్ట్రేషన్ చేశామని పేర్కొన్నారు

## టీఎస్ఎండీసీలో ఆరుగురు అధికారులు రిలీవ్

- అవినీతి ఆరోపణలే కారణమని సమాచారం

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీసీ)లో పనిచేసే ఆరుగురు అధికారులను మాతృశాఖలకు పంపించారు. దీర్ఘకాలికంగా టీఎస్ఎండీసీలో విధులు నిర్వర్తించడం, అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో వారిని వెంటనే రిలీవ్ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. టీఎస్ఎండీసీలో జనరల్ మేనేజర్లుగా పనిచేస్తున్న పాండు రంగారావు, దేవేందర్ రెడ్డి, ప్రశాంతి, ప్రాజెక్టు ఆఫీసర్లు (పీవో) దశరథం, తోట శ్రీధర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ను మాతృసంస్థలకు పంపించారు. వీరంతా టీఎస్ఎండీసీలో ఏడెనిమిది సంవత్సరాలకు పైగా డిప్యూటేషన్‌పై పనిచేస్తుండడంతో తిరిగి సొంతశాఖలకు పంపించినట్టు తెలిసింది. ఇటీవలే గనులశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ టీఎస్ఎండీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలోనే వీరిని మాతృశాఖలకు పంపించడం చర్చనీయాంశంగా మారింది.

## జూన్ 30 వరకు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : తిరుమలలో జూన్ 30 వరకు శుక్ర, శని, ఆది వారాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్టు టీటీడీ అధికారులు పేర్కొన్నారు. సామాన్య భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శనం కల్పించేందుకు వీలుగా బ్రేక్ దర్శనం రద్దు చేసినట్టు టీటీడీ తెలిపింది. వీఐపీ బ్రేక్ దర్శనానికి సిఫారసు లేఖలు స్వీకరించబోమని, భక్తులు గమనించి సహకరించాలని కోరారు. శుక్రవారం 3 కిలోమీటర్ల మేర భక్తులు క్యూలో ఉన్నారు. శ్రీవారి దర్శనానికి 20 గంటలకుపైగా సమయం పట్టింది.